క్లుప్తంగా

జేపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు విధుల్లో చేరిక

డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్: జేపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు విధుల్లో చేరారని చేవెళ్ల డివిజన్ డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచన మేరకు జేపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు కొందరు విధుల్లో చేరారని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో 88 మంది ఉద్యోగులు ఉండగా అందులో 34 మంది విధుల్లో చేరారని మిగతా 54 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరు

యూత్ కాంగ్రెస్ నాయకుడు భాస్కర్‌గౌడ్



కేశంపేట: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ అన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... కర్ణాటక రాష్ట్రంలాగే తెలంగాణలో కూడా అధికార పార్టీపైన తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని విమర్శించారు. రాష్ట్రంతో పాటు కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. సెంటిమెంట్, మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర ద్వారా ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని చెప్పారు. బీఆర్ఎస్ బీజేపీ ప్రభుత్వాలను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా చెప్పారు.

పండగ సాయన్న విగ్రహావిష్కరణకు రండి

కొత్తూరు: షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న పండగ సాయన్న విగ్రహావిష్కరణకు మండలం నుంచి అధిక సంఖ్యలో ముదిరాజ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రామ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పెత్తందార్లు, భూస్వాముల దాడుల నుంచి పీడిత ప్రజలను కాపాడిన గొప్పధీరుడు సాయన్న అని కొనియాడారు. అలాంటి ధీరుడి విగ్రహావిష్కరణకు ప్రజలు పాల్గొనాలని కోరారు.

నేడు విగ్రహ ఆవిష్కరణ

కేశంపేట: షాద్‌నగర్‌లో నేడు ఆవిష్కరించనున్న పండుగ సాయన్న విగ్రహావిష్కరణకు మండలంలోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యాలో పాల్గొని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ మండల కన్వీనర్ శ్రీశైలం అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అవినీతి,దోపిడీ, అత్యాచారాలు పెరిగినప్పుడు ప్రజలను రక్షించేందుకు వీరులు ఉద్భవిస్తారని అన్నారు. సాయన్న చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తలకొండపల్లి: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్‌యాదవ్ తెలిపిన వివరాలు.. మిడ్జిల్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పక్కా సమాచారంతో మండలంలోని వెల్జాల్‌లో శనివారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- నిధులున్నా పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు
- కరెంట్ షాక్‌కు బలవుతున్న మూగ జీవులు



హిమాయత్‌నగర్‌లో ఓ ఇంటి ఎదుట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మొయినాబాద్‌రూరల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కోటి రూపాయలు నిధులు మంజూరు చేసిందని మండల సర్వసభ్య సమావేశంలో విద్యుత్ అధికారులు ప్రకటించారు. అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా సమస్యలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, హిమాయత్‌నగర్, చిన్నమంగళారం, వీరన్నపేట్, బాకారం, ఎత్‌మార్‌పల్లి ఆయా గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ లేకపోవడం, దిమ్మె సైతం నేలమట్టంలో ఉండడం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోడ్ల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చిలుకూరు బాలాజీకి వెళ్లే రహదారికి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు, ప్రయాణికులు పేర్కొంటున్నారు. అప్పారెడ్డిగూడలో ఇళ్ల ముందే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో వేలాడుతున్న తీగలు ఏ తీగకు విద్యుత్ సరఫరా అవుతుందోనని భయాందోళనలో ప్రజలు ఉంటున్నారు. విద్యుత్ అధికారులు గత నెలలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నిధులు మంజూరైనట్లు తెలిపారు. కానీ గ్రామాల్లో వేలాడుతున్న తీగలు, ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, గాలిదుమారం వస్తే కరెంటు ఉండదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదకరంగా ఉన్న తీగలను తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



అప్పారెడ్డిగూడలో రోడ్డు పక్కనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

కంచె ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో మూగ జీవాలు చనిపోతున్నాయి. గ్రామాల్లో ఇళ్ల పక్కనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడం ప్రజలు భయంతో జంకుతున్నారు. రాత్రి సమయంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్లు శబ్దాలతో మండుతుంటాయి. అధికారులు ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేయించాలి

– బీస నర్సింహ్మ, హిమాయత్‌నగర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చేవెళ్ల: మానసిక ఒత్తిడిని తట్టుకోవాలంటే ప్రతి ఒక్కరు యోగా చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మార్కెట్ యార్డులో శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి ఆధ్వర్యంలో ఋషి సాధన యోగా శిక్షణ కేంద్రం సౌజన్యంతో సీక్రెట్స్ ఆఫ్ నేచర్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి రోజు యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఋషి సాధన యోగా కేంద్రం వారు సనాతన సంస్కృతి, వినూత్న యోగా శిక్షణ, జీవన విధానంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. చేవెళ్లలో జ్ఞాననిధి ప్రేమ్ చిద్విలాస్ ఆచార్య బాబుజీచే కార్యక్రమం నిర్వహించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింలు, మండల మహిళా అధ్యక్షురాలు లత, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాంరెడ్డి, పూజారి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... నిధులు, నీళ్లు, నియామకాల ప్రాతిపదికన ఏర్పాటైన తెలంగాణలో ప్రజలకు అన్యాయమే జరుగుతుందని వాపోయారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇచ్చిన పనులు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని 7, 9, 27వ వార్డుల్లో కోటి రూపాయలతో మూడు పార్కుల నిర్మాణం, 18వ వార్డులో రూ.38లక్షలతో అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకే ప్రభుత్వం పార్కుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల ఆరోగ్యానికి పార్కులు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కమిషనర్ వెంకన్న, మాజీ చైర్మన్ విశ్వం, కౌన్సిలర్లు కౌసల్య, శంకర్, ఈశ్వర్‌రాజు, ప్రతాప్‌రెడ్డి, ప్రేమలతా, యుగేందర్, జమృద్‌ఖాన్, శేఖర్, రాఘవేందర్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.



పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా ఫాతీమమాత వార్షికోత్సవ వేడుకలు



ప్రసంగిస్తున్న బిషప్ జయరావు

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఫాతీమ మాత చర్చి వార్షికోత్సవ వేడుకలను శనివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శిలువాను ఊరేగించి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో బిషప్ జయరావు, ఫాదర్ సైమన్‌రెడ్డి, స్థానికులు దిలీప్‌రెడ్డి, అల్బీన్‌రెడ్డి, మర్రెడ్డి, ఆరోగ్యరెడ్డి, ఇన్నారెడ్డి, యాగరెడ్డి, బాలశౌరెడ్డి, దేవేందర్‌యాదవ్, జోలీ రవీందర్ పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌదమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం కౌన్సిలర్ లతాశ్రీ, శ్రీశైలంగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి పల్లకీ సేవ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు పల్లకీ మోస్తూ భక్తిపాటలు, ఆటలతో స్వామివారిని ఊరేగించారు. అనంతరం వసంతరావు, సీతామహాలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, ప్రభాకర్, సతీష్, రమేష్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌నాయక్, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, పద్మ వెంకటేశ్, గోరియానాయక్ ఆలయ అర్చకులు రఘుపతిరావు, ప్రమోద్, సునీల్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలను విజయవంతం చేయండి

మండల అభివృద్ధి అధికారి సంధ్య



మొయినాబాద్ రూరల్ : ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగే సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాలలోపు గల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ద్వారా నిర్వహించే క్రీడల్లో స్త్రీలు అథ్లెటిక్స్, ఖోఖో, పురుషులు ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, కబడ్డీలో స్త్రీ, పురుషులకు అవకాశం ఉందన్నారు. ఈ క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడల్లో ఆడేందుకు ఆసక్తిగల వారు ఆదివారం లోపు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వీఓఏలకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: వీఓఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మెకు శనివారం డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్ , రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ సంఘీభావం తెలిపారు. వీఓఏలు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని పనికి తగిన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. హక్కుల కోసం గొంతెత్తుతుంటే ఈ ప్రభుత్వం అణిచివేసే ధోరణి అవలంబిస్తోందన్నారు. ఉద్యమాలను నుంచి పుట్టిన పార్టీయే ఉద్యమకారులను, ప్రశ్నించే వారిని అణిచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీఏఓలను పర్మనెంట్ చేయడంతో పాటు వారి వేతనాలను రూ.26వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్, పాండు నాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు యాదయ్యగౌడ్, సత్యం యాదవ్, రాజేశ్, ఇమ్రాన్, చంద్రశేఖర్, రవి, యాదయ్య, శ్రీకాంత్, విజయ్, భానుకిరణ్, సత్యంయాదవ్, రాజేందర్, బాలరాజు, వీఏఓలు ఉన్నారు.

15 నుంచి విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఆమనగల్లు:పట్టణంలోని ప్రతిభానగర్‌కాలనీలో నూతన ఆలయంలో రేపటి నుంచి శివలింగ,నందీశ్వర,ఎల్లమ్మదేవత, విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లలిత, జంగయ్యయాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సోనిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

ఇబ్రహీంపట్నం: జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోనిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని ఇబ్రహీంపట్నం బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం సోనీ ఆత్మకుశాంతి చేకూరాలని బీఎస్పీ నేతలు ర్యాలీ నిర్వహించారు. సమ్మె చేస్తున్న జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల శిబిరం వద్దకు వెళ్లి సోనీ చిత్రపటానికి నివాళి అర్పించారు. జేపీఎస్, ఓపీఎస్‌లకు న్యాయం జరిగేంత వరకు బీఎస్పీ వారికి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, ప్రహ్లాద, శాంత, మహేందర్, కళ్యాణ్, కరుణాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవాలు



షాద్‌నగర్: స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నేతలు



మొయినాబాద్: సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



చేవెళ్ల: బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

శంకర్‌పల్లి: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాన చౌరస్తాలో విజయోత్సవ సంబురాలు జరుపుకొన్నారు. బాణాసంచా కాల్చి, స్వీట్లను పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్ణాటక ప్రజలు బీజేపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పారని విమర్శించారు. బీజేపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని తెలిపారు. కాగా, రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయమోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రకాష్‌గుప్త, ఎజాస్, రాములు, యాదయ్య, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ సంబరాలు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నాయి. మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి బాణాసంచా పేల్చారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వసంతం, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

మొయినాబాద్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు శనివారం మొయినాబాద్ సంబరాలు జరుపుకొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ మాట్లాడుతూ.. దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. దానికి కర్ణాటక ఎన్నికలు నిదర్శనమన్నామని తెలిపారు. కర్ణాటక ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. రాబోయే రోజుల్లో దేశమంతటా ఇదే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ కండిక రమేష్, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఉపసర్పంచ్‌లు శ్రీనివాస్‌యాదవ్, బిక్షపతి, నాయకులు వెంకట్‌రెడ్డి, మహేందర్‌ముదిరాజ్, కేబుల్ రాజు, సత్యనారాయణ, రాజు, అనంతరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారు..

షాద్‌నగర్: కర్ణాటక ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారని పీసీసీ కార్యదర్శి శంకర్ అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయడంతో శనివారం ఆ పార్టీ నాయకులు షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కర్ణాటకలో బీజేపీ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీకే మద్దతు పలికారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పు బీజేపీకి చెంపపెట్టులాంటిందని అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రజల్లో విశ్వాసాన్ని నింపిందని వివరించారు. తెలంగాణలో జరగబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారం సాధించడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీ నేతలకు, కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని నింపాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సీతారాం, అశోక్, సత్తయ్య పాల్గొన్నారు.



శంకర్‌పల్లి చౌరస్తాలో: సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



మోకిలలో సంబరాలు చేసుకుంటున్న నేతలు

